

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV


సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 344 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 15, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

సివిల్ సప్లై.. సీక్రెట్ దందా..



సీక్రెట్ దందాను ఛేదించిన మొనగాడు స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్

ఉక్కుపాదం మోపిన ఉన్నతాధికారికి ఊహించని బదిలీ....

రైస్ గోదాముల అక్రమాలపై రాజీలేని కేసులు మోపినందుకు దక్కిన గౌరవం స్థానచలనం

అక్రమాలను ఎదిరిస్తే ఎంతటి ఉన్నతాధికారికైనా తిప్పలు తప్పవు.

దళారిగాళ్ళ పైరవిలకు దరిద్రపు నిర్ణయాలు.

అక్రమ కేసులను మాఫీ చేసుకోవడం కోసమే పైరవీలు జరుగుతున్నాయా.

సివిల్ సప్లై విభాగంలో తిరుగులేని నిజాయితీ కనపరిచిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్.

అక్రమ వ్యాపారాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

నిజాయితీలో దూసుకుపోయినందునే స్థాన చలనం తప్పలేదు.

రైతులకు అన్యాయం చేయడానికి దళారీగాళ్లకు సహకరిస్తున్నారా.!

అధికార హోదాలో ప్రభుత్వానికి గొప్పపేరు తెచ్చిన అధికారి స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్.

అడుగుపెట్టిన ప్రతిచోట అక్రమ దందాపై అదిరిపోయే కేసులు పెట్టారు.

వామ్మో మాకొద్దు ఈ సారు అంటూ పట్నంలో పైరవీలు దళారీగాళ్ళు.

డాక్టర్ బరిగెల శివ



సివిల్ సప్లై శాఖలో సాగుతున్న అక్రమ దందాలకు అడ్డుకట్ట వేసిన నిజాయితీగల అధికారి స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్‌కు అనూహ్య బదిలీ ఎదురైంది. రైతుల ప్రయోజనాలే పరమావధిగా భావించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపిన ఆయనకు స్థానచలనం తప్పలేదు. రైతు గోదాముల పేరుతో సాగుతున్న అక్రమాలు, ధాన్యం కొనుగోళ్లలో మోసాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. యూరియా బస్తాల అక్రమ విక్రయాలకు చెక్ పెట్టి నిజమైన రైతులకు నేరుగా ఎరువులు అందేలా చర్యలు చేపట్టారు. దళారీ వ్యవస్థకు కళ్లెం వేస్తూ సివిల్ సప్లై శాఖలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. అక్రమ వ్యాపారులపై కేసులు నమోదు చేసి రైతుల పక్షాన నిలిచిన అధికారిగా గుర్తింపు పొందారు. అయితే ఆయన తీసుకున్న నిర్ణయాలు కొందరి ప్రయోజనాలకు అడ్డంకిగా మారాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ వెనుక రాజకీయ ఒత్తిళ్లు, దళారీల పైరవీలు ఉన్నాయన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. నిజాయితీగా పనిచేసే అధికారులకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన పాలకులే వారి బదిలీలకు కారణమవుతున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన అధికారికి జరిగిన స్థానచలనం ప్రభుత్వ పాలనలో నిజాయితీకి దక్కుతున్న గౌరవం ఏమిటో నిలదీస్తోంది.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

హైదరాబాద్‌లో ఆటో కార్మికులకు 2 వేల ఇళ్లు..

రూ.220 కోట్లతో 'ఆటో నగర్ కాలనీ'

హైదరాబాద్‌లో ఆటోరిక్షా కార్మికుల కోసం రూ.220 కోట్లతో 2 వేల ఇళ్లు

బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మీగూడ ప్రాంతాల్లో ఒక్కో చోట 500 ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లు-టవర్ల తరహాలోనే ఆటో కార్మికుల కోసం ఈ కాలనీ

ఆటోరిక్షా కార్మికులకు ఇళ్ల పథకం చేపట్టాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ ప్రతిపాదనకు ప్రభుత్వ అనుమతి



గిగ్ కార్మికులకు సామాజిక భద్రత: రేవంత్ రెడ్డి



సంక్షేమ విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రారంభం

రాహుల్ గాంధీతో కలిసి చట్టం ఆవిష్కరణ

ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల జీవిత బీమా

ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా

ప్రత్యేక బోర్డు, గుర్తింపు కార్డుల ఏర్పాటు

హైదరాబాద్, నవంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :

తెలంగాణ రాష్ట్రంలోని గిగ్, వేదిక ఆధారిత కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమం కోసం రూపొందించిన విధానాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఆవిష్కరించారు. గిగ్, వేదిక ఆధారిత కార్మికుల నమోదుకు సంబంధించిన ఆన్‌లైన్ విధానాన్ని ప్రారంభించారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని జయభేరీ మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక నుంచి కార్మికుల సంక్షేమానికి సంబంధించిన చట్టాన్ని వారికి అంకితం చేశారు. తెలంగాణ వేదిక ఆధారిత గిగ్ కార్మికుల నిబంధనల పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అంతకుముందు శిల్పారామం నుంచి జయభేరీ మైదానం వరకు నిర్వహించిన భారీ ద్విచక్ర వాహన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పాల్గొన్నారు. గిగ్ కార్మికుల ద్విచక్ర వాహనాలపై ముఖ్యమంత్రి, రాహుల్ గాంధీ, పలువురు మంత్రులు ప్రయాణిస్తూ కార్మికులతో కలిసి ర్యాలీగా జయభేరీ మైదానానికి





- మిగతా 2లో..

కవిత పార్టీ రేవంత్ రెడ్డి కోసం పని చేస్తోంది: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రేవంత్ సైన్యం'

అన్న ప్రవీణ్ కుమార్

కాంగ్రెస్‌కు మరో అనుబంధ సంస్థలా కవిత పార్టీ పని చేస్తోందని విమర్శ

రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా కవిత వ్యవహరిస్తున్నారని ఆరోపణ



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

గిగ్ కార్మికులకు సామాజిక భద్రత: రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి..

చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం నెహ్రూ జన్మదినం రోజున గిగ్, వేదిక ఆధారిత కార్మికుల చట్టాన్ని ప్రజలకు అంకితం చేశామని తెలిపారు. ఈ చట్టం అదే రోజు నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారు. దీని ద్వారా ప్రతి గిగ్ కార్మికుడికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం లభిస్తుందని, ఆరోగ్య భద్రత కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కార్మికుడికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తామని చెప్పారు. గిగ్, వేదిక ఆధారిత కార్మికుల కోసం చట్టాన్ని రూపొందించే ప్రక్రియలో ఐఐటీ వంటి సంస్థలతో పాటు సామాజిక కార్యకర్త నిఖిల్ డే ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఎంతో సహకారం అందించారని ముఖ్యమంత్రి తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు, నిపుణులతో అనేక సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, గిగ్, వేదిక ఆధారిత కార్మికులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఆటో కార్మికులకు 2 వేల ఇళ్లు.. రూ.220 కోట్లతో 'ఆటో నగర్ కాలనీ'

హైదరాబాద్‌లో ఆటోరిక్షా కార్మికుల కోసం రూ.220 కోట్లతో 2 వేల ఇళ్లు
బండ్లగూడ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మీగూడ ప్రాంతాల్లో ఒక్కో చోట 500 ఇళ్లు
ఇందిరమ్మ ఇళ్లు-టవర్ల తరహాలోనే ఆటో కార్మికుల కోసం ఈ కాలనీ
ఆటోరిక్షా కార్మికులకు ఇళ్ల పథకం చేపట్టాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ ప్రతిపాదనకు ప్రభుత్వ అనుమతి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లో ఆటోరిక్షా కార్మికులకు తక్కువ ధరకు ఇళ్లు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గృహ నిర్మాణ పథకానికి ఆమోదం తెలిపింది. 'ఆటో నగర్ కాలనీ' పేరుతో రూ.220 కోట్ల అంచనా వ్యయంతో 2 వేల ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన వర్గాల) ఇళ్లను నిర్మించనున్నారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పేదల కోసం అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్లు' పథకంలో భాగంగా నగరంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు-టవర్ల తరహాలోనే ఆటో కార్మికుల కోసం ఈ కాలనీని అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్‌తో పాటు పరిసర పట్టణ ప్రాంతాల్లో ఆటోరిక్షా కార్మికులకు ప్రత్యేకంగా ఇళ్ల పథకం చేపట్టాలని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ ప్రతిపాదించగా.. ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగరంలోని నాలుగు దిశల్లో ఇళ్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించారు. బండ్లగూడ (ఎల్ఐసీ కాలనీ), గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మీగూడ ప్రాంతాల్లో ఒక్కో చోట 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నారు. మొత్తం 2 వేల ఇళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందిరమ్మ ఇళ్లు-టవర్ల పథకానికి వర్తించే మార్గదర్శకాలు, లబ్ధిదారుల అర్హతలు, ఆర్థిక సాయం, రిజర్వేషన్లు, ఎంపిక, కేటాయింపు విధానాలనే ఈ పథకంలోనూ అనుసరించనున్నారు. అయితే లబ్ధిదారులు తప్పనిసరిగా ఆటోరిక్షా కార్మికులై ఉండాలనే ప్రత్యేక నిబంధన విధించారు. మరోవైపు, సీర్ ప్రాంతం, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ కేటగిరీల కింద డిమాండ్ సర్వే ఆధారంగా లక్ష సరసమైన ధరల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా సీర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా 12 వేల ఇళ్ల నిర్మాణానికీ అనుమతి ఇచ్చింది. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడం, గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.220 కోట్ల అంచనా వ్యయంతో అనుమతి ఇచ్చిన ప్రభుత్వం.. స్థలాల లభ్యత, అనుకూలత, సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, ఆర్థిక ప్రతిపాదనలు సమర్పించాలని హౌసింగ్ బోర్డును ఆదేశించింది.

కవిత పార్టీ రేవంత్ రెడ్డి కోసం పని చేస్తోంది: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రేవంత్ సైన్యం' అన్న ప్రవీణ్ కుమార్
కాంగ్రెస్‌కు మరో అనుబంధ సంస్థలా కవిత పార్టీ పని చేస్తోందని విమర్శ
రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా కవిత వ్యవహరిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జై బీమ్ న్యూస్

మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కవిత నేతృత్వంలోని ఈ పార్టీ ప్రజల కోసం కాదని, కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విభాగంలా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ వంటి అనేక అనుబంధ సంస్థలు ఉంటాయని, టీఆర్ఎస్ కూడా అలాంటి ఒక అనుబంధ సంస్థేనని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ అంటే 'తెలంగాణ రక్షణ సేన' కాదని, 'తెలంగాణ రేవంత్ సైన్యం' అని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈగ కూడా వాలకుండా కంటికి రెప్పలా కాపాడుతున్న సైన్యమే ఇదని, దానికి నాయకురాలు కవిత అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి సౌజన్యంతో, పాంచజన్యం ఎజెండాతోనే కవిత టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలను త్వరలోనే ప్రజల ముందుకు తెస్తానని ఆయన స్పష్టం చేశారు.

సౌదీకి విమాన సర్వీసులు రద్దు పొడిగింపు

న్యూఢిల్లీ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

హూతీలతో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో సౌదీ అరేబియాకు వెళ్లే విమాన సర్వీసుల రద్దును విమానయాన సంస్థలు పొడిగించాయి. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ రియాద్, దమామ్ విమానాలను ఈ నెల 30 వరకు రద్దు చేశాయి.జెద్దాకు వెళ్లే విమాన సర్వీసులను ఈ నెల 21 వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇండిగో, ఆకాశ ఎయిర్ కూడా సౌదీకి వెళ్లే విమానాలను ఈ నెల 30 వరకు రద్దు చేశాయి.

సివిల్ సప్లైలో సీక్రెట్ దందా..

సీక్రెట్ దందాను ఛేదించిన మొనగాడు స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్
ఉక్కుపాదం మోపిన ఉన్నతాధికారికి ఊహించని బదిలీ....
రైస్ గోదాముల అక్రమాలపై రాజీలేని కేసులు
మోపినందుకు దక్కిన గౌరవం స్థానచలనం .
అక్రమాలను ఎదిరిస్తే ఎంతటి ఉన్నతాధికారికైనా తిప్పలు తప్పవు.
దళారిగాళ్ళ పైరవిలకు దరిద్రపు నిర్ణయాలు.
అక్రమ కేసులను మాఫీ చేసుకోవడం కోసమే పైరవీలు జరుగుతున్నాయా.
సివిల్ సప్లై విభాగంలో తిరుగులేని నిజాయితీ కనపరిచిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్.
అక్రమ వ్యాపారాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.
నిజాయితీలో దూసుకుపోయినందునే స్థాన చలనం తప్పలేదు.
రైతులకు అన్యాయం చేయడానికి దళారీగాళ్లకు సహకరిస్తున్నారా.!
అధికార హోదాలో ప్రభుత్వానికి గొప్పపేరు తెచ్చిన అధికారి స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్.
అడుగుపెట్టిన ప్రతిచోట అక్రమ దందాపై అదిరిపోయే కేసులు పెట్టారు.
వామ్మో మాకొద్దు ఈ సారు అంటూ పట్నంలో పైరవీలు దళారీగాళ్ళు .
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ప్రభుత్వ వ్యవస్థలలో నిజాయితీగా పని చేస్తున్న ఉన్నతాధికారులు మానసిక వేదనకు గురవుతున్నారని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సివిల్ సప్లై శాఖలో విపరీతమైన అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని సంవత్సరాల కాలం పాటు అన్ని జిల్లాలలో చాలాచోట్ల నిర్మాణం లేని రైతు గోదాముల పేర్ల మీద పెద్ద ఎత్తున బిల్లులను పొందుకున్నట్లు అనుమానాలు వ్యక్తమైన సందర్భంలో ఆయా ప్రాంతాల్లోని స్థానిక రైతులు స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ దారులపై పకడ్బందీ కేసులు పెట్టారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నత అధికారులపై బలమైన విశ్వాసం బలమైన నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం వాళ్లకు అధికార పదవులు కల్పిస్తే వాటిని సద్వినియోగం చేసుకునే అధికారులు చాలా తక్కువగాను అధికార హోదాలను దుర్వినియోగపరిచే అధికారులు ఎక్కువగాను ఉంటున్నారని తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రభుత్వ ఉన్నత అధికారుల హోదా పదవులు వాళ్లు నిర్వహిస్తున్న విధులు రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తున్నాయని తెలిపారు. ప్రజలను మోసగించడంలో కొంతమంది ఉన్నతాధికారులు తమకున్న అధికార పదవులను శక్తివంచన లేకుండా వాడుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల కొరకు పని చేయాల్సిన ప్రతి ఉన్నతాధికారి విధుల నిర్వహణలో భాగంగా నిరూప యోగమైన వ్యక్తిగత నిర్ణయాలను అమలుపరచుకుంటున్నారని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలోని సివిల్ సప్లై శాఖ కమిషనర్ గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర రైతులకు తన పనితనం ఏ విధంగా ఉంటుందో మరొకసారి నిరూపించుకున్నారని గుర్తుచేశారు. రైతులకు జరుగుతున్న తీవ్రమైన అన్యాయాల పట్ల రైతులకు జరుగుతున్న తీవ్రమైన మోసాల పట్ల రైతులు అనుభవిస్తున్న కఠినాతి కఠినమైన కష్టాల పట్ల ఒక నిర్దిష్టమైన అవగాహనను ఏర్పాటు చేసుకొని సివిల్ సప్లై శాఖలో కనివిని ఎరుగని సేవలందించారని తెలియజేశారు. ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో నడిచే ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నడిచే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన ఆధారాలను పూర్తిస్థాయిలో తెప్పించుకొని ఏఏ జిల్లాలో ఏ ప్రాంతాల్లో రైతులకు అన్యాయం జరుగుతుందో రైతులు వేధింపులకు గురవుతున్నారో ఆయా ప్రాంతాలను వ్యక్తిగతంగా సందర్శించి రైతులు పడుతున్న కష్టాలను రైతులకు జరుగుతున్న అన్యాయాలపై చెల్లించిపోయి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి రైస్ మిల్లర్ గోదాముల యాజమాన్యాలపై కఠినమైన కేసులు పెట్టి రైతుల పక్షాన నిలబడిన తీరు మహా అద్భుతం అన్నారు. యూరియా బస్తాలను దళారీ గాళ్లు ప్రైవేట్ దందా రూపంలో అమ్మకానికి పెట్టుకొని వ్యాపారాలు చేస్తుండగా వాటిని నియంత్రించడం కోసం కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ ప్రత్యేక చొరువ తీసుకున్నారని అదే సందర్భంలో కేంద్రం నుండి యూరియా సరఫరా అనేది తెలంగాణ రాష్ట్రానికి ఉన్నపాటుగా నిలిపివేయబడడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆందోళనలు ఉవ్వెత్తున లెగిసాయని వాటి ప్రభావం రైతుల ఆత్మహత్యలపై పడుతున్న సందర్భంలో తనదైన శైలిలో రైతులకు భరోసాను కల్పించి దళారీ దందను పూర్తిగా నిర్మూలిస్తూ రైతులకు నేరుగా యూరియా బస్తాలను సరఫరా చేసుకునే సౌకర్యాలను కల్పించి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. అదే సందర్భంలో ప్రతి మండలంలోని రెవెన్యూ రికార్డుల ఆధారంగా సాధారణ రైతులు పండించుకునే పంటలకు ప్రభుత్వం నుండి యూరియా బస్తాలను నేరుగా రైతులకు చేరవేయబడడానికి మొట్టమొదటిసారి ఆన్లైన్ పద్ధతిని తీసుకొచ్చి నిజమైన రైతులకు మాత్రమే యూరియా బస్తాలు అందచేయబడేటట్లు క్రియాశీలక పాత్ర పోషించారని అభినందించారు. మరోవైపు నకిలీ విత్తనాలు నకిలీ దాన్యం మొలకలు అమ్ముకోవడానికి అవకాశం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసి దళారి వ్యాపారస్తులకు సవాల్గా నిలిచారని అభినందించారు. రైతులను మోసగించడం ఎంత నేరమో కమిషనర్ గా దగ్గరుండి పసిగట్టిన స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎంతగా మోసపోతున్నారో ఎంతగా నష్టాలను ఎదుర్కొంటున్నారో దళారీ వ్యవస్థల చేతిలో ఎట్లా నలిగిపోతున్నారో సూక్ష్మస్థాయిలో పసుగట్టి తన అధికార హోదాలో వాటన్నిటికీ సంపూర్ణమైన శాశ్వత పరిష్కారం తీసుకురావాలని ఒంటరి పోరాటం చేసిన తీరు అద్భుతం అన్నారు.

రాజకీయ జోక్యం దళారీ వ్యవస్థకు లాభం!.

రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రభుత్వ వ్యవస్థలోనైనా ఒకవైపు పరిపాలన మరోవైపు దళారీ దందా సాఫీగాను, సునాయాసంగా నడుస్తుంటాయని వాటిలో భాగంగా సివిల్ సప్లై శాఖలో ఎక్కువశాతం జరిగే అవకాశాలు ఉంటుండందున రైతులు పెద్ద మొత్తంలో మోసపోతున్నారని గుర్తుచేశారు.సివిల్ సప్లై శాఖలో జరుగుతున్న అక్రమాలను ఒక్కొక్కటిగా ఏరి పారేస్తూ శాఖను పటిష్ట పరచడం కోసం తీవ్రంగా ప్రయత్నించిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ పై రాజకీయ పైరవీలు పెద్ద ఎత్తున జరిగినట్లు రైతులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని అన్నారు కొంతకాలంగా రైతులపై జరుగుతున్న వరుస అక్రమ



దాడులపై కఠినమైన కేసులు మోపిన స్టీఫెన్ ఎలాంటి రాజకీయ పైరవీలకు ఎలాంటి వ్యక్తిగత ప్రలోభాలకు తావివ్వకుండా రైతుల సంక్షేమమే తనకు ప్రాధాన్యమని భావిస్తూ సివిల్ సప్లై శాఖను ఉన్నత స్థాయిలో ప్రక్షాళన చేయడం కోసం కఠోరంగా శ్రమించారని గుర్తుచేశారు. ప్రతి జిల్లాలో రైతులకు వ్యతిరేకంగా జరుగుతున్న దళారీ వ్యవస్థపై ఎప్పటికప్పుడు నిగావేసి ఆయా ప్రాంతాల్లోని అధికారులను అప్రమత్తం చేస్తూ అలాంటి దళారి వ్యవస్థలను పూర్తిస్థాయిలో నిర్మూలించే ప్రయత్నం చేశారని అందులో భాగంగా 70 శాతానికి పైగా రైతులకు మేలు చేశారని అదే పనితీరును నిజాయితీగా కొనసాగిస్తున్న సందర్భంలో ఒక్కసారిగా పిడుగు లాంటి వార్త వినాల్సి వచ్చిందని పరిమిత కాలం పూర్తి గాక ముందే సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పోలీసు వర్గాల్లోనే కాకుండా రాష్ట్ర రైతులను రాష్ట్ర ప్రజలను ఒక్కసారిగా ఆవేదనకు ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. దీన్నిబట్టి చూస్తే రైతుల పక్షాన ప్రజల పక్షాన నిలబడి ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ రైతులకు వ్యతిరేకంగా కొనసాగుతున్న అడ్డగోలు వ్యాపారాలను అక్రమ వ్యాపారాలను అణిచివేసి రైతుల పక్షాన నిలబడినందున బదిలీ వేటుపడడం బాధాకరమన్నారు.దళారీ గాళ్లంతా ఏకమై వామ్మో ఈ సారు మాకు వద్దంటూ మంత్రుల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరి వైరవీలు చేసుకొని దళారి దంద లేకపోతే ఆస్తుల సంపాదన కష్టమంటూ మంత్రుల దగ్గర మొరపెట్టుకొని అవినీతి అక్రమార్కుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ ను తక్షణమే మార్చివేసి వాళ్లకు సహకరించాలని చేసుకున్న పైరవీలు మొత్తం మీదుగా ఫలించాయని ఏది ఏమైనా మంత్రులకు రైతుల మీద ప్రేమానురాగాలు కనికరాలు లేవనేది మరొకసారి రుజువైందని భావించాల్సి ఉంటుందన్నారు. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి రైతుల మేలు కొరకు ప్రయాసపడితే మంత్రులు దళారీగాళ్లపై అక్రమంగా రైతు గోదాములు నడుపుతున్న వ్యాపారులపై మమకారం పెంచుకొని వాళ్లకుసహకరించి రైతు బాంధవుడుగా నిలిచిన మాజీ సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను బదిలీ చేయించి తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమానికి వ్యతిరేకంగా అధికారిక దళారి దందాను కొనసాగించుకోవడానికి అక్రమార్కులకు అక్రమ వ్యాపార పగ్గాలను కట్టబెట్టినట్టుగా ఉందన్నారు. అధికారి ఎక్కడ పని చేసినా అధికారేనంటూ ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చే స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ లాంటి అధికారులు చాలా అరుదుగా ఉంటారని అలాంటి అధికారులపై జరుగుతున్న రాజకీయ ఒత్తిళ్ళను సీఎం రేవంత్ రెడ్డి తిప్పికొడుతూ ప్రజల పక్షాన నిలబడుతున్న అధికారులను కాపాడుకోవడం కోసం మంత్రుల కుట్రలను చేదిస్తూ రైతులకు ప్రజలకు మేలుకరంగా నిలవాలని కోరారు. అదే సందర్భంలో ప్రభుత్వ పక్షాన రైతుల పక్షాన ప్రజల పక్షాన వాళ్ళ యోగక్షేమాలను కోరుకుంటూ నిజాయితీగా పనిచేస్తున్న స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ లాంటి అధికారిని ప్రత్యేక స్థాయిలో గుర్తించాల్సిన అవసరం ఎంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు.

కృష్ణవేణి ఆదిత్య డీజీ స్కూల్‌లో అట్టహాసంగా బాలల దినోత్సవ వేడుకలు





విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సందడిగా మారిన పాఠశాల ప్రాంగణం

హసన్‌పర్తి, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14న నిర్వహించే బాలల దినోత్సవ వేడుకలను హసన్‌పర్తి మండల కేంద్రంలోని కృష్ణవేణి ఆదిత్య డీజీ పాఠశాలలో శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడి, ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కట్టుకూరి రాజిరెడ్డి మాట్లాడుతూ, బాలలే దేశ భవిష్యత్తుకు పునాదులని, ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ప్రతిభను కనబరచాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రజిత రాణి మాట్లాడుతూ, బాలల దినోత్సవం పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు చక్కని వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి చదువుతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు జ్యోతి, రమ్య, వసుమతి, జ్ఞానేశ్వర్, లావణ్య, నీలిమ, కవిత, రాధ, వర్షిత, లావణ్య, పావని, రాఘుశ్రీ పాఠశాల సిబ్బంది నాగరాజు, రాజు, నరేష్, బషీర్ అహ్మద్, విద్యార్థులను ప్రోత్సహిస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.

అంబాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





బాలల సంక్షేమంపై గ్రామసభలో విస్తృత చర్చ
పది కీలక అంశాలపై అవగాహన కల్పించిన కార్యదర్శి ఝాన్సీ
నేటి బాలలే రేపటి పౌరులు - సర్పంచ్ కుమ్మరి కుమార్

కమలాపూర్, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

అంబాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత, నైతిక విలువలు, క్రమశిక్షణ, బాలల హక్కులు, భవిష్యత్తు లక్ష్యాలపై సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో బాలల సమగ్ర అభివృద్ధి, భద్రత, సంక్షేమానికి సంబంధించిన పది కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి కుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు పట్టుదలతో చదవాలని సూచించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, విద్యతోపాటు మంచి ప్రవర్తన, సంస్కారం అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ విద్య మనిషి జీవితంలో అత్యంత శక్తివంతమైన సాధనమని, విద్యకు కులమత, పేదరిక భేదాలు లేవని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి చెడులను గుర్తించి సరైన మార్గంలో నడవాలని, తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలుగుతూ ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయుడు ఆలేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. “ఒక వ్యక్తి పేదవాడిగా పుట్టడం అతని తప్పు కాదు.. పేదవాడిగా చావడం మాత్రం అతని తప్పు” అనే సందేశాన్ని వివరిస్తూ పేదరికాన్ని అధిగమించడానికి విద్య గొప్ప మార్గమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతల మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, పెద్దలతో గౌరవంగా వ్యవహరించాలని అన్నారు. మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, సమయపాలన, పరస్పర సహకారం అలవర్చుకొని బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం గ్రామసభలో కార్యదర్శి ఝాన్సీ బాలల సంక్షేమానికి సంబంధించిన పది ప్రధాన అంశాలను వివరించారు. విద్య, పాఠశాల హాజరు అంశంలో బడిబయట పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను గుర్తించడం, బాలికల విద్యకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించడం అవసరమన్నారు. బాల్యవివాహాల నివారణ, కౌమారదశ ఆరోగ్యంపై అవగాహన, బాల కార్మికత్వం, అక్రమ రవాణా నిరోధం, బాలలపై శారీరక, మానసిక వేధింపుల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణ, టీకాలు, వైద్య సేవలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. దివ్యాంగ బాలలకు అవసరమైన సహాయక పరికరాలు, విద్యా, వైద్య సదుపాయాలు అందించాలన్నారు. పాఠశాలకు వెళ్లే మార్గాల్లో రోడ్డు భద్రత, వీధి దీపాలు, ప్రమాదకర ప్రాంతాలపై దృష్టి పెట్టాలని, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, ఇంటర్నెట్ దుర్వినియోగంపై పిల్లలకు అవగాహన కల్పించాలని వివరించారు. కుల, వర్గ, లింగ వివక్ష లేకుండా బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించడంతోపాటు జనన ధ్రువీకరణ పత్రాలు, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పిల్లలకు అందేలా చూడాలని తెలిపారు. బాలల భద్రత, సంక్షేమం కేవలం పాఠశాలలు, ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్యశాఖ, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని కార్యదర్శి ఝాన్సీ పేర్కొన్నారు. బాలల సమస్యలను గుర్తించే సమయంలో వారి వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా గౌరవప్రదంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు వైష్ణవి, మిహిరా, రియాన్షిక మాట్లాడుతూ బాలల దినోత్సవ ప్రాముఖ్యతను, చాచా నెహ్రూగా ప్రసిద్ధి చెందిన భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకునే విశేషాన్ని వివరించారు. బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, వార్డు సభ్యులు కుమ్మరి నాగేశ్వర్ రావు, దూలం నిరంజన్, ఉపాధ్యాయులు ఆలేటి నరసింహారెడ్డి, శ్రీనివాస్, సంపత్, భారతి, రజిత, సరస్వతి, రహమత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతల, విద్యార్థులు అక్షిత మంత్రి, వైష్ణవి, జాన్సీ, నగేష్, మీనా, అభి, సోహైల్, మణిదీప్, హేమంత్, కార్తీక్, రుద్రాన్ కాందారి, అంగన్వాడీ టీచర్లు రజిత, వినోద, సిఎ భాగ్య, పాఠశాల, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చేపలు, రొయ్యల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ అభినందనీయం





మత్స్యకార మహిళలు వినూత్న ఉత్పత్తుల తయారీతో ఆర్థికంగా ఎదగాలి - ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

వరంగల్, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

మత్స్యకారులు తమకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, వినూత్న ఆలోచనలతో నూతన ఉత్పత్తులను తయారు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. చేపలు, రొయ్యల వ్యర్థ పదార్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం గొర్రెకుంటలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా చేపలు, రొయ్యల వ్యర్థ పదార్థాలతో సంఘం సభ్యులు తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్ సేంద్రియ ఎరువును పరిశీలించి, తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ పదార్థాలను సైతం విలువైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని, ఈ దిశగా సంఘం సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు స్వయంగా తయారు చేసిన చేపల పచ్చళ్లు, రొయ్యల పచ్చళ్లను పరిశీలించి వాటి తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేస్తూ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. సంఘం సభ్యుల విజ్ఞప్తి మేరకు స్థానిక గుండ్లకుంటను కూడా ఎమ్మెల్యే సందర్శించారు. గుండ్లకుంట సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఐదు ఎకరాలు కేటాయిస్తే చేపలు, రొయ్యల వ్యర్థాలతో పెద్ద ఎత్తున సేంద్రియ ఎరువుల తయారీ చేపట్టేందుకు అవకాశం ఉంటుందని సంఘం సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకార సంఘాల అభివృద్ధికి, సభ్యుల ఆర్థిక పురోగతికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మత్స్యకారులు సంప్రదాయ వృత్తికే పరిమితం కాకుండా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించేలా అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా మత్స్యకారులు చేపలు, రొయ్యల పచ్చళ్లతో పాటు మరిన్ని ఆహార ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్లో మంచి గుర్తింపు పొందేలా అవసరమైన శిక్షణ, సహకారం అందించాలని అధికారులకు సూచించారు. మత్స్యకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ పద్మజ, జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి, గీసుకొండ తహసీల్దార్ రాజ్ కుమార్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మెప్మా డీఎంసీ రేణుక, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధి చొప్పరి సోమయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుచంద్ర, మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు కళావతి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అశోక్, సంఘం సభ్యులు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించొద్దు - డీఎంహెచ్ఓ



హన్మకొండ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలు తీరును వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ, టీకాల పంపిణీ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య న్యూ శాయంపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే అవుట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి చిన్నారులకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరుణాపురం సబ్‌సెంటర్‌తో పాటు మడికొండలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. అదేవిధంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి హసన్‌పర్తి అప్‌గ్రేడెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అవుట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. చిన్నారులకు నిర్దేశిత కాలపట్టిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

వరంగల్‌లో ట్రాఫిక్ పోలీసుల ముమ్మర తనిఖీలు..

నిబంధనలు ఉల్లంఘించిన 23 వాహనాలు సీజ్



వరంగల్, నవంబర్ 14(జై భీమ్ క్రైమ్ న్యూస్)

వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడంతో పాటు రహదారి భద్రతను పెంపొందించే లక్ష్యంతో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు శనివారం ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. నర్సంపేట మెయిన్ రోడ్, లేబర్ కాలనీలోని తెలంగాణ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. వరంగల్ ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ కోడూరి సుజాత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ తనిఖీల్లో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, సరైన ధృవీకరణ పత్రాలు వెంట లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలను పోలీసులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 23 వాహనాలను సీజ్ చేసి వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత మాట్లాడుతూ ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీజ్ చేసిన 23 వాహనాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన సరైన ధృవీకరణ పత్రాలను వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అధికారులకు చూపించి, నిబంధనల ప్రకారం వాహనాలను తిరిగి తీసుకెళ్లవచ్చని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఐ కోడూరి సుజాత విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

జన్నారంలో విషాదం

హైదరాబాద్, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. హైదరాబాద్ శివారులోని మజీద్‌పూర్‌లో అర్ధరాత్రి 2 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు మరో వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జన్నారం మండలానికి చెందిన నవీన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడు సిద్ధుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నవీన్ మృతితో జన్నారం మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

ఖాజీపేటలో ఘనంగా నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా సంబరాలు





క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి - ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

ఖాజీపేట, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా సంబరాలు ఖాజీపేటలోని నారాయణ పాఠశాలలో ఘనంగా జరిగాయి. నారాయణ ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన ఈ క్రీడా పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా వైద్యాధికారి ఎ. అప్పయ్య, ఖాజీపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని అందిస్తాయని అన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. జోనల్ డీజీఎం రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడమే ఈ క్రీడా పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అండర్-14, అండర్-17 విభాగాలతో పాటు చెస్, క్యారమ్స్ వంటి వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్థానిక నారాయణ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు తేజావత్ అనిత మాట్లాడుతూ విద్యార్థులను అగ్ని, పృథ్వి, నాగ్, త్రిశూల్ వంటి వివిధ హౌస్ గ్రూపులుగా విభజించి పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఖాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, సాఫ్ట్ స్కిల్స్ ఆర్ అండ్ డీ బానోత్ లక్పతి, వివిధ బ్రాంచ్‌ల ప్రధాన ఉపాధ్యాయులు రాజశేఖర్, ఫర్హానా, మమత, అకడమిక్ డీన్లు, వి.పి.లు, పి.ఈ.టీలు, ఏఓలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న సీనియర్ సిటిజన్స్ కమిషన్ చీఫ్ కమిషనర్ జస్టిస్ తిరుమలాదేవి

పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్ సైతం అమ్మవారి దర్శనం





వరంగల్, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని శనివారం ఉదయం సీనియర్ సిటిజన్స్ కమిషన్ చీఫ్ కమిషనర్ జస్టిస్ తిరుమలాదేవి సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు దేవస్థాన అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ తిరుమలాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు ఆమెకు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ మోహన్ కామేశ్వరన్ సైతం శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ పి. సాంబశివరావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కమటం వేణుగోపాల్, దేవస్థాన అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



హన్మకొండ, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

సీనియర్ సిటిజన్ కమిషన్ చీఫ్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమల దేవిని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమీక్ష సమావేశం నిమిత్తం హనుమకొండకు విచ్చేసిన చీఫ్ కమిషనర్ జస్టిస్ ఈద తిరుమల దేవిని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా అభినందించారు.

కీసర పోలీస్‌స్టేషన్‌లో భారీ ప్రక్షాళన.. 11 మంది సిబ్బందికి బదిలీ

వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్న పోలీసు సిబ్బంది.. ఉన్నతాధికారుల కీలక నిర్ణయం

కీసర, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)



కీసర పోలీస్‌స్టేషన్‌లో ఉన్నతాధికారులు భారీ స్థాయిలో శాఖాపరమైన మార్పులు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్ఐ నాగరాజుతో పాటు మరో 10 మంది కానిస్టేబుళ్లను సౌత్‌జోన్‌కు బదిలీ చేస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కీసర పోలీస్‌స్టేషన్‌లో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. నెల రోజుల క్రితం సీఐ, ఎస్ఐలు ఏసీబీ అధికారులకు లంచం తీసుకుంటూ పట్టుబడగా, నాలుగు రోజుల క్రితం ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కూడా ఏసీబీకి చిక్కారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో వరుసగా అవినీతి ఆరోపణలు, ఏసీబీ కేసులు వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు ఈ ప్రక్షాళన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెక్టార్లకు కొత్త ఎస్ఐలను నియమించారు. కీసర సెక్టార్‌కు వెంకట్‌రెడ్డి, నాగారం సెక్టార్‌కు గౌరేందర్‌గౌడ్, చీర్యాల్ సెక్టార్‌కు ప్రభాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరుస అవినీతి ఘటనల నేపథ్యంలో కీసర పోలీస్‌స్టేషన్‌లో చేపట్టిన ఈ భారీ బదిలీలు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారాయి.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బాలల భవిష్యత్తే దేశ భవిష్యత్తు: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

బాలలందరికీ సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, భద్రత కల్పించి వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు నిర్వహించనున్న బాలల వారోత్సవాలు నర్సంపేటలోని సంజీవని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ మోహన్ రావు -- వినోద దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంజీవని ఆశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి రాజమణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బాలల భవిష్యత్తుతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి బాలుడికి సురక్షితమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి సమగ్ర అభివృద్ధికి అందరూ బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఉమారాణి మాట్లాడుతూ బాలల విద్యాభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

బాలలతో కలెక్టర్ సరదా సందడి.. విజేతలకు బహుమతులు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చిన్నారులతో సరదాగా గడుపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కోకో, కబడ్డీ, వ్యాసరచన, లెమన్ స్పూన్ తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అలాగే మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకురాలు, డీసీపీఓ బత్తిని కళ్యాణి, బాలల సంక్షేమ సమితి సభ్యులు షాహిదా బేగం, మధు, తహసీల్దార్ దేవేందర్, సీడీపీఓలు మధురిమ, జ్యోతి, షేర్ ఎన్జీవో కోఆర్డినేటర్ శిరీష, సీహెచ్ఎల్ కేస్ వర్కర్ ఎన్. మౌనిక, డీసీపీయూ ఔట్రీచ్ వర్కర్ రాజుల సుమన్, సంజీవని ఆశ్రమం నిర్వాహకులు రమ, జ్యోతి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచన మేరకే వినియోగించాలి

ఔషధ నిరోధకతపై అవగాహన కల్పించిన ప్రొఫెసర్ జానపరెడ్డి కృష్ణవేణి, ఆచార్య గాదే సమ్మయ్య





హన్మకొండ, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

యాంటీబయాటిక్ మందులను వైద్యుల సూచన లేకుండా వినియోగించడం వల్ల బ్యాక్టీరియాలో ఔషధ నిరోధకత పెరిగి భవిష్యత్తులో సాధారణ వ్యాధులకు సైతం చికిత్స అందించడం కష్టతరమవుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జానపరెడ్డి కృష్ణవేణి అన్నారు. ప్రజలకు ఔషధాల సరైన వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని ఆమె సూచించారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 14న హనుమకొండలోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో యాంటీబయాటిక్ నిరోధకత, యాంటీ బ్యాక్టీరియల్ నిరోధకత, ఔషధాల బాధ్యతాయుత వినియోగం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఫార్మసిస్టుల సామాజిక బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ డాక్టర్ జానపరెడ్డి కృష్ణవేణి మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నదని తెలిపారు. వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్ మందులను తీసుకోవడం, వైద్యులు సూచించిన చికిత్సను మధ్యలోనే నిలిపివేయడం వల్ల ఔషధ నిరోధకత పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల భవిష్యత్తులో అనేక ఇన్ఫెక్షన్లకు సమర్థవంతమైన చికిత్స అందించడం సవాలుగా మారుతుందని వివరించారు. ప్రజల్లో మందుల వినియోగంపై అవగాహన పెంపొందించడం ప్రతి ఫార్మసిస్ట్ సామాజిక బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. మరో ముఖ్య ఉపన్యాసకులుగా పాల్గొన్న ఆచార్య గాదే సమ్మయ్య మాట్లాడుతూ, ఫార్మసీ విద్యార్థులు పుస్తకాల ద్వారా పొందే జ్ఞానంతో పాటు ప్రయోగశాలల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన ఔషధాల ఆవిష్కరణకు శాస్త్రీయ పరిశోధనలు, నిరంతర అధ్యయనం, నిబద్ధతతో కూడిన ప్రయోగాలు ఎంతో అవసరమని తెలిపారు. ఒక ఔషధం ప్రయోగశాలలో అభివృద్ధి చెందినప్పటి నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చే వరకు వివిధ విభాగాలకు చెందిన నిపుణుల సమష్టి కృషి అవసరమని వివరించారు. అలాగే మాదకద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును, కుటుంబాల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఫార్మసీ విద్యార్థులు సమాజంలో ఔషధాల దుర్వినియోగం, యాంటీబయాటిక్ నిరోధకత, మాదకద్రవ్యాల ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటీబయాటిక్ మందులను వైద్యుల సూచనల మేరకే వినియోగించాలని, మిగిలిపోయిన మందులను స్వయంగా తీసుకోకూడదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అవసరమైన టీకాలు వేయించుకోవాలని వక్తలు సూచించారు. ఫార్మసిస్ట్ వృత్తికి ఉన్న గౌరవాన్ని కాపాడుతూ, తమ వృత్తిపరమైన అర్హతలు దుర్వినియోగం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు హితవు పలికారు. యాంటీబయాటిక్స్‌ను వివేకంతో వినియోగిస్తూ వాటి ప్రభావాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సందేశమిస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో చైతన్య ఇన్‌స్టిట్యూట్ యాజమాన్య ప్రతినిధులు రవీందర్ రెడ్డి, యుగంధర్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, ఫార్మసీ విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి





పిల్లలకు స్నేహపూర్వక గ్రామాల నిర్మాణమే గ్రామ బాలల సభల ప్రధాన లక్ష్యం
జిల్లా సంక్షేమ అధికారి ఈపీ. ప్రేమలత

ములుగు, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామ బాలల సభల్లో భాగంగా చిన్నబోయినపల్లి, శివపురం గ్రామ పంచాయతీలలో బాలల సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జిల్లా సంక్షేమ అధికారి ఈపీ. ప్రేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలకు స్నేహపూర్వకమైన గ్రామాలను నిర్మించడమే గ్రామ బాలల సభల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బాలల సంరక్షణ, పోషణ, విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు వారి హక్కుల పరిరక్షణకు గ్రామస్థాయి నుంచే సమిష్టి కృషి అవసరమని తెలిపారు. బాలలకు ఎలాంటి వివక్ష, హింస, వేధింపులు లేని సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్నబోయినపల్లి గ్రామ సర్పంచ్ నాగార్జున మాట్లాడుతూ గ్రామంలోని బాలల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ, వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అనుకూలమైన వాతావరణాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. శివపురం గ్రామ సర్పంచ్ జబ్బ సరోజన మాట్లాడుతూ బాలల ఉజ్వల భవిష్యత్తు కోసం విద్య, ఆరోగ్యం, భద్రత, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బాలలు అన్ని రంగాల్లో రాణించేలా గ్రామస్థులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గత సంవత్సరం నుంచి గ్రామంలో ఒక్క బాల్య వివాహం కూడా నమోదు కాకపోవడంతో శివపురం గ్రామ పంచాయతీని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్మానించి ప్రకటించారు. ఇది గ్రామానికి గర్వకారణమని, బాలల భద్రత దిశగా తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని పేర్కొన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్. హరికృష్ణ మాట్లాడుతూ చిన్నారులు సురక్షిత స్పర్శ (సేఫ్ టచ్), అసురక్షిత స్పర్శ (అన్ సేఫ్ టచ్) మధ్య తేడాలను తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఆపద, వేధింపులు లేదా హక్కుల ఉల్లంఘన ఎదురైనా భయపడకుండా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేసి సహాయం పొందాలని వివరించారు. రెండు గ్రామ పంచాయతీల కార్యదర్శుల అధ్యక్షతన ఈ గ్రామ బాలల సభలు నిర్వహించారు. అనంతరం చిన్నబోయినపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల, గోగుపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రతిభను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, రెండు గ్రామ పంచాయతీల పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా 500 మంది విద్యార్థులకు టిఫిన్ బాక్సుల పంపిణీ





సుజాత విద్యానికేతన్ వ్యవస్థాపకురాలు ఆకుతోట ఊర్మిళాదేవి నాలుగో వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం

హసన్‌పర్తి, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

బాలల దినోత్సవం సందర్భంగా హసన్‌పర్తిలోని 66వ డివిజన్ సుజాత విద్యానికేతన్ పాఠశాలలో వ్యవస్థాపకురాలు ఆకుతోట ఊర్మిళాదేవి నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు 500 టిఫిన్ బాక్సులను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆత్మీయ అతిథులుగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, ఆత్మ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి చంద్రమోహన్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. 44 సంవత్సరాల క్రితం హసన్‌పర్తిలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించిన ఆకుతోట ఊర్మిళాదేవి సేవలు అభినందనీయమన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఆమె ప్రత్యేకత అని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ పాఠశాలను ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారామ్ కర్ణ మాట్లాడుతూ.. తన తల్లి స్ఫూర్తితో గత 35 సంవత్సరాలుగా పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొక్కలు నాటడం, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, కాలుష్య రహిత దీపావళి, హోలీ, జల సంరక్షణ, ధరిత్రీ దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాలకు గుర్తింపుగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక అవార్డులు అందుకున్నామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు 500 టిఫిన్ బాక్సులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే మధుమేహానికి అసలైన ఆయుధం

మధుమేహ నియంత్రణకు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం తప్పనిసరి
గుంటూరు సీజీహెచ్ఎస్ వైద్యులు డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్

గుంటూరు, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల మధుమేహం వేగంగా విస్తరిస్తోందని, దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుంటూరు సీజీహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గుంటూరు నగరంలోని పాలెం సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మధుమేహం ఏ ఒక్క వయసు వారికో, వర్గానికో పరిమితమైన సమస్య కాదన్నారు. రోజువారీ ఆహారంలో చక్కెర, కొవ్వు పదార్థాలను తగ్గించి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఫాస్ట్‌ఫుడ్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆహార పదార్థాల ప్యాకేజీలపై హెచ్చరికలు ముద్రించాలని అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ నడక, వ్యాయామం చేయడంతో పాటు శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవాలని తెలిపారు. మధుమేహం ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చని, ముఖ్యంగా కుటుంబంలో మధుమేహ చరిత్ర ఉన్నవారు, అధిక బరువు కలిగినవారు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సీజీహెచ్ఎస్ లబ్ధిదారులకు రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, కట్టా వెంకటేశ్వర్లు చిరుధాన్యాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టులు కౌసల్య, ఆయేషా, సునీల్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమసుందరి, వైద్య సిబ్బంది పేరేశ్వరరావు, మురళీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.



కిట్స్ కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం





వరంగల్, నవంబర్ 14 (జై భీమ్ న్యూస్)

వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాలలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాల్లో విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు, చర్చా కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయ సమాచార బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్ ప్రొఫెసర్ బి. రమాదేవి తదితరులు ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, డిజిటల్ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఐ అభివృద్ధి చెందుతున్నప్పటికీ మానవుల ఆలోచనా సామర్థ్యం, భావోద్వేగ మేధస్సుకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ బి. రమాదేవి మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో 89,297 పుస్తకాలు, 6,035 ఈ-పుస్తకాలు, 50,866 ఆన్‌లైన్ జర్నల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రంథపాలకులు డాక్టర్ కె. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ నవంబర్ 18న ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సి. వెంకటేష్, అధ్యాపకులు, గ్రంథాలయ సిబ్బంది, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



హైద్రాబాద్, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

ముత్తంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విద్యార్థుల మధ్య ఈ వేడుకలను ఆనందోత్సాహాలతో జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, వివిధ ఆకర్షణీయమైన వేషధారణలతో పాఠశాలకు హాజరై సందడి చేశారు. విద్యార్థుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, వినోద కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సామూహిక భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. బాలల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారికి మంచి విద్య, విలువలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ వేడుకలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డిని మార్చే వరకు నేను ఫైట్ చేస్తా

కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ అధినేత

హైదరాబాద్, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

రేవంత్ రెడ్డి పెట్టిన భారత్ సమ్మిట్ నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. – ఈ సమ్మిట్ ప్రధాని మోదీకి వ్యతిరేకంగా, రాజకీయ లబ్ధి కోసం మాత్రమే పెట్టినట్టుగా నాకు అనిపిస్తోందని ప్రజా శాంతి పార్టీ అధినేత కే ఏ పాల్ వ్యాఖ్యానించారు. లేకపోతే.. నార్వేకి చెందిన ఒక రిపోర్టర్ ని ఈ సమ్మిట్ కి పిలవడం ఏంటని ప్రశ్నించారు. నేను అమెరికాలో అత్యంత శక్తివంతమైన నేత స్పీకర్ మైక్ జాన్సన్, ఎలాన్ మస్క్, మార్క్ జుకర్ బర్గ్ వంటి 25–30 మంది పెద్ద పెద్ద ప్రపంచ వ్యాపారవేత్తలను తీసుకొద్దామని అనుకున్నాను. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చే వారిని రేవంత్ రెడ్డి ఎందుకు ఆపుతున్నారు? ఈ సమ్మిట్ అసలు ఎందుకోసం పెట్టారు? రేవంత్ రెడ్డిని నేరుగా అడుగుతున్నానని అన్నారు. గత ఎడాది వందల కోట్లు ఖర్చుపెట్టి ఒక సమ్మిట్ పెట్టారు. ఏమైనా ఉపయోగం ఉందా? లక్షల కోట్ల అప్పు పెరిగిపోయింది, రాష్ట్రం సర్వనాశనం అయిపోయింది. మోదీకి వ్యతిరేకంగా ఏదైనా చేయాలనుకుంటే ఢిల్లీకి వెళ్లి చేయండి. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే నాతో చేతులు కలపండి. రేవంత్ రాజకీయంగా పుట్టకముందే రాష్ట్రానికి బిల్ క్లింటన్, జార్జ్ బుష్, వారెన్ బఫెట్ సహా అనేకమంది అమెరికన్ బిగ్ షార్ట్స్ ని తీసుకొచ్చాను. రేవంత్ రెడ్డిలో మార్పు రావాలి. లేదా రేవంత్ రెడ్డిని మార్చే వరకు నేను ఫైట్ చేస్తానని అన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

నూతన కాకినాడ కౌన్సిల్ తొలి సమావేశంలో నెహ్రూ విగ్రహ పునఃప్రతిష్ఠకు తీర్మానం చేయాలి

టీటీడీ సెంటర్‌లో స్వాతంత్ర్య సమరయోధులు ఏర్పాటు చేసిన నెహ్రూ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలి
137వ జయంతి సందర్భంగా నివాళులర్పించిన సామాజికవేత్త రమణరాజు

కాకినాడ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా కాకినాడలోని బాలాజీ చెరువు సెంటర్‌లో ఉన్న నెహ్రూ స్మారక కూడలి వద్ద ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1964లో స్వాతంత్ర్య సమరయోధులు నెహ్రూ మరణించిన ఏడాది అనంతరం బాలాజీ చెరువు సెంటర్‌లో నెహ్రూ బస్ట్ సైజు సిమెంట్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కూడలి విస్తరణ పనుల కారణంగా పలుమార్లు విగ్రహాన్ని తొలగించి పునఃప్రతిష్ఠించినట్లు వివరించారు. 2021లో అప్పటి కాకినాడ పాలకవర్గం తీర్మానం మేరకు నిలువెత్తు నెహ్రూ కాంస్య విగ్రహాన్ని కుళాయిచెరువు ప్రాంగణంలోని వివేకానంద పార్కుకు తరలించారని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన బాలాజీ చెరువు సెంటర్‌లో స్వాతంత్ర్య సమరయోధులు ఏర్పాటు చేసిన నెహ్రూ స్మారక విగ్రహం లేకపోవడం నగర చరిత్రకు లోటుగా ఉందన్నారు. 2026-31 కాలానికి ఎన్నికయ్యే నూతన కాకినాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ తొలి సమావేశం ఎజెండాలోనే నెహ్రూ బస్ట్ సైజు విగ్రహాన్ని తిరిగి బాలాజీ చెరువు సెంటర్‌లో ప్రతిష్ఠించేలా తీర్మానం చేయాలని రమణరాజు కోరారు. అనంతరం వివేకానంద పార్కులోని నెహ్రూ కాంస్య విగ్రహం పాదాల వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. రాజకీయాలు, కులమతాలు, వర్గ విభేదాలకు అతీతంగా నగర చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.



కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

గ్రంథాలయం - జ్ఞానానికి ద్వారం అనే అంశంపై విద్యార్థుల కళాత్మక ప్రదర్శన





హన్మకొండ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయం ఆధ్వర్యంలో “గ్రంథాలయం -- జ్ఞానానికి ద్వారం” అనే అంశంపై రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 20 బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. విద్యార్థులు రంగురంగుల రంగవల్లులను రూపొందించి గ్రంథాలయాల ప్రాముఖ్యత, విజ్ఞానం, పఠనాసక్తి, సృజనాత్మకతను అద్భుతంగా ప్రదర్శించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు మాత్రమే కాకుండా జ్ఞానాభివృద్ధికి, నిరంతర అభ్యసనానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని విద్యార్థులు తమ కళాత్మక ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు. విద్యార్థుల్లో పఠన సంస్కృతిని పెంపొందించడంతో పాటు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విద్యార్థుల సృజనాత్మకత, ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పిల్లలకు అందమైన బాల్యాన్ని బహుమతిగా ఇవ్వడమే నిజమైన బాలల దినోత్సవం: డాక్టర్ అనితా రెడ్డి



హన్మకొండ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

పిల్లలకు అందమైన బాల్యాన్ని బహుమతిగా ఇవ్వడమే నిజమైన బాలల దినోత్సవమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక దివ్యాంగులైన చిన్నారుల మధ్య బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దివ్యాంగులైన పిల్లలకు కూడా ఇతర పిల్లలతో సమానమైన హక్కులు ఉంటాయని తెలిపారు. దేశ భవిష్యత్తు అయిన చిన్నారులకు ప్రేమ, ఆప్యాయతలతో కూడిన అందమైన బాల్యాన్ని అందించాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు తగిన సమయం కేటాయించాలని, తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహనతోనే ఆరోగ్య పరిరక్షణ

డీఎంహెచ్ఓ కార్యాలయంలో సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు





రాజమహేంద్రవరం, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో మధుమేహ వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తపోటు, హిమోగ్లోబిన్ శాతంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పి. కోమల మాట్లాడుతూ మధుమేహాన్ని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మధుమేహం, అధిక రక్తపోటును నియంత్రించవచ్చని తెలిపారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. మధుమేహ బాధితులు కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడంతో పాటు రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలని, పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం డీఎంహెచ్ఓ డాక్టర్ పి. కోమల మార్గదర్శకత్వంలో, జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ హరి పర్యవేక్షణలో నిర్వహించారు.

శ్రీ పైడి ఐటీఐలో నవంబర్ 16న జాబ్ మేళా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు - జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష

రాజమహేంద్రవరం, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 16వ తేదీ సోమవారం తాళ్లపూడి మండలం ప్రక్కిలంకలోని శ్రీ పైడి ప్రైవేట్ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి. హెచ్. శిరీష తెలిపారు. ఉదయం 9 గంటలకు తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా ప్రారంభమవుతుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో కొవ్వూరు సమీపంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న ఠాగూర్ లేబొరేటరీస్ కెమికల్ ఫ్యాక్టరీలో వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 38 సంవత్సరాల వయస్సు కలిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారితో పాటు ఉద్యోగాలపై ఆసక్తి ఉన్నవారు కూడా హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా వఎజూశ్రీశిఎ-ఎవత్.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో నేరుగా జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9398318601 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ 7న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి

విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలి: ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి

హైద్రాబాద్, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)



ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, నిరుద్యోగ యువతకు ఉపాధి హక్కుల కల్పన కోసం విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ సారయ్య నారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు మార్రి శ్రీమన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజాస్వామ్య విలువలు, ప్రభుత్వ విద్య, నిరుద్యోగ యువత హక్కులకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం-2020ను తిరస్కరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం తీసుకురావాలని కోరారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అన్నారు. భగత్‌సింగ్ ఆశయాలు, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 7న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి విద్యార్థులు, నిరుద్యోగ యువతను సమీకరించాలని, జిల్లా, పట్టణ, మండల స్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు సూచించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, రాష్ట్ర కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, ఉప ప్రధాన కార్యదర్శి మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మానస్ కుమార్, రాజ్ కుమార్, స్వప్న, సహాయ కార్యదర్శులు లింగం రవి, సత్య ప్రసాద్, శివకుమార్, సాంబమూర్తి, రమేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి: పున్నం వేణు

హన్మకొండ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని బీజేవైఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నం వేణు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనను నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నయీమ్‌నగర్ పెద్దమోరి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పున్నం వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని అన్నారు. హామీల అమలు కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రమోద్, ప్రదీప్, ఉపాధ్యక్షులు గణేష్, శివ, కార్తీక్, సిద్ధు, కార్యదర్శులు ప్రశాంత్, రాజేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

క్యూబాలో ఆకలి కేకలు

హవానా, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

కరీబియన్ సముద్రంలోని ద్వీప సమూహ దేశం క్యూబాలో అధికారంలో ఉన్న సామ్యవాద వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, రాయితీతో కూడిన ఆహారం, అత్యధికులకు ప్రభుత్వరంగ ఉపాధి అందిస్తూ వచ్చింది. బియ్యం, బీన్స్, పాలపొడి, చికెన్, వంటనూనె, గుడ్ల వంటి ఆహార దిగుమతులపై గతంలో ఏటా 2 బిలియన్ డాలర్లకు (రూ.18,855 కోట్లు) పైగా ఖర్చు చేసేది. దాదాపుగా 99 శాతం అక్షరాస్యత ఉన్న ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఓ మోస్తరుగా ఉన్నా, కనీస అవసరాలకు ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు అదంతా గత చరిత్ర. సుమారు కోటీ 10 లక్షల జనాభా గల నేటి క్యూబాను సుదీర్ఘకాలంగా ఆర్థికసంక్షోభం పీడిస్తోంది. అమెరికా ఇంధన ఆంక్షలు, పెరిగిన ద్రవ్యోల్బణం, తరుగుతున్న ప్రభుత్వ వనరులు క్యూబన్ల జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇంధన ఆంక్షలు ఈ ద్వీప జనజీవనాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటకరంగం తీవ్రంగా క్షీణించింది. రాజధాని నగరం హవానాలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రం వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారు. ఉదయాన్నే ఏడింటికి తలుపులు తెరిచే ఈ కేంద్రంలో పంపిణీ చేసే ఆహారం కోసం కొంతమంది ప్లాస్టిక్ బొచ్చెలతో రాత్రే అక్కడికి చేరుకొని రోడ్డు మీద పడుకొంటున్నారు. “మేము చాలా గడ్డు రోజులు గడుపుతున్నాం” అని ఈ కేంద్రానికి వచ్చిన రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఫెర్నాండో ఫెర్నాండెజ్ (71) తెలిపారు. “వీరు పంపిణీ చేసే ఆహారంతో నా బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నిండుతుంది” అని అయిదుగురు పిల్లల తల్లి మర్లీస్ పాన్స్ (34) చెప్పారు. క్యూబాలో అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ఇటువంటి సామాజిక వంటశాలలే అభద్రతా భావంతో ఉన్న స్థానికులకు జీవనాధారంగా మారాయి.

డీలిమిటేషన్ అడుగులు..

దేశ రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన డీలిమిటేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటికీ రాష్ట్రపతి అధికారికంగా ముగించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952, 1963, 1973 మరియు 2002 సంవత్సరాల్లో డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయివర్షాకాల సమావేశాలు ఇంకా ప్రొరోగ్ కానందున, కొత్త సమావేశాల కోసం 14 రోజుల గడువు అవసరం లేకుండా కేవలం 48 గంటల ముందుగా ఎంపీలకు సమాచారం ఇచ్చి ప్రత్యేక భేటీని నిర్వహించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకేతాలు ఇచ్చారు.సాధారణంగా పార్లమెంట్ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుండి నాలుగు రోజుల్లోనే రాష్ట్రపతి సభను ప్రొరోగ్ చేస్తారు. కానీ, ఈసారి వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 90 రోజులకు చేరువవుతున్నా సభను అధికారికంగా ముగించకపోవడంతో 2008 నాటి 87 రోజుల రికార్డు సైతం బద్దలైంది. గత ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో లోక్‌సభ స్థానాలను 543 నుండి 850 వరకు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో అది వీగిపోయింది.ఈ నేపథ్యంలో, ఈసారి పక్కా సంఖ్యాబలాన్ని కూడగట్టుకుని, ఎప్పుడైనా సరే 48 గంటల షార్ట్ నోటీసుతో సభను సమావేశపరిచి బిల్లును గట్టెక్కించాలని కేంద్రం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో పలు దఫాలు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. 1952, 1955 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఉమ్మడి నియోజకవర్గాలుగా ఉండేవి. వీటిలో ఒకరు సాధారణ అభ్యర్థి, మరొకరు రిజర్వుడు అభ్యర్థిగా ఉండేవారు. ఆ తరువాత ఈ విధానం మారిపోయింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను విభజించాలన్న డీ లిమిటేషన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాల సంఖ్య పెరిగింది.ప్రస్తుతం 175 నియోజకవర్గాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వివిధ ఎన్నికల సమయంలో ఏ విధంగా పెరిగిందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 1955లో 245 నియోజకవర్గాలుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తర్వాత ఎన్నికలకు 300 స్థానాలకు చేంది తర్వాత మళ్లీ తగ్గిపోయింది. దీనికి కారణం జనాభా పెరుగుదల మేరకు డీ లిమిటేషన్ సిఫార్సులే.ఎంతమంది ప్రజలకు ఎంతమంది ప్రజాప్రతినిదులు ఉండాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు డీ లిమిటేషన్ అమల్లోకి వచ్చింది. దేశంలో 1952 నాటికి 494 పార్లమెంటు స్థానాలు ఉండేవి 1962లో 522 పార్లమెంటు స్థానాలు, 3,771 అసెంబ్లీ స్థానాలకు పెరిగాయి. 1972లో 543 పార్లమెంటు స్థానాలు 3,997 అసెంబ్లీ స్థానాలుండగా ఆ సంఖ్య 2002లో 543 పార్లమెంటు స్థానాలకు, 4,123 అసెంబ్లీ స్థానాలకు చేరింది. ప్రతి పదేళ్లకు ఒకసారి చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సంఖ్య మారుతుంటుంది. 1953లో చంద్రశేఖర అయ్యర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా 1973లో జేఎల్ కపూర్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంటు సభ్యులుండాలన్న ప్రతిపాదనలతో సంఖ్య పెరిగింది 2002లో నియమితులైన కులదీప్ సింగ్ అనే విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన సిఫార్సులు 2008 నుంచి అమల్లోకి వచ్చాయి.మరోవైపు, కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియే 'డీలిమిటేషన్' ఇది మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపడి ఉంది. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో స్థానాలు పెరిగి, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల (తెలుగు రాష్ట్రాలతో సహా) ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 2026 తర్వాత జనాభా గణన ఆధారంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 543 నుండి సుమారు 850 వరకు పెరిగే అవకాశం ఉంది. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ బిల్లు) ప్రకారం, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలులోకి వస్తాయి. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరుగుతాయి, కానీ జనాభా నియంత్రణ పాటించిన తెలుగు రాష్ట్రాలు , కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రాతినిధ్యం (లోక్‌సభ సీట్లు) తగ్గుతుందనే భయం ఉంది. అభివృద్ధి, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను నష్టపరిచే విధంగా ఈ విభజన ఉండకూడదని పలువురు ఎంపీలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ బిల్లుపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి, ఇది దేశ రాజకీయ సమతుల్యతను మార్చే అవకాశం ఉన్నందున చాలా సున్నితమైన అంశంగా మారింది.రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన రెండు మూడొంతుల మెజారిటీని అడ్డదారిలో కూడగట్టుకునేందుకు అమిత్ షాకు సమయం ఇవ్వడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేయకుండా జాప్యం చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి నాలుగుసార్లు లేఖలు రాసినా స్పందన లేదని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

10 లక్షల కోట్లు పెట్టుబడులు

విశాఖపట్టణం, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా 303 ప్రతిపాదనల రూపంలో ఏపీకి ఏకంగా రూ. 9.89 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, చేనేత క్లస్టర్ల వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయన్నారు. జూన్ 2024 నుంచి ఈ సమ్మిట్‌కు ముందు వరకు 714 ప్రాజెక్టులకు రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. సీఐఐ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'స్వచ్ఛ షహర్' కేటగిరీలో దేశంలోనే అత్యంత శుభ్రమైన నగరంగా విశాఖపట్నం నిలిచిందని, అలాంటి అద్భుతమైన నగరంలో ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ 2017లో ఆంధ్రప్రదేశ్‌లో తన తొలి తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో అనంతపురం జిల్లాలో ప్రారంభమైన ఈ పరిశ్రమ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పుడు అదే సంస్థ మరో భారీ పెట్టుబడికి సిద్ధమవుతుండటం ఏపీలో ఉన్న పారిశ్రామిక అవకాశాలకు నిదర్శనంగా నిలుస్తోంది.కియా ఇండియా సీఈఓ గ్వాంగ్గు లీ సీఐఐ సదస్సులో ఈ పెట్టుబడి ప్రతిపాదనను వెల్లడించారు. కొత్త ప్లాంట్ ద్వారా సుమారు 12 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏడాదికి 4.3 లక్షల వాహనాలను తయారు చేస్తున్న సంస్థ.. కొత్త విస్తరణతో ఈ సామర్థ్యాన్ని 6.3 లక్షలకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఏపీలోని ప్లాంట్ నుంచి 100 దేశాలకు 4.1 లక్షలకు పైగా వాహనాలు, కిట్లను ఎగుమతి చేయడం విశేషం.చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇప్పుడు పెట్టుబడుల ప్రకటనలకే పరిమితం కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 2024లో కుదిరిన పెట్టుబడి ఒప్పందాల్లో 58 శాతం ఇప్పటికే ప్రాజెక్టుల అమలు దశకు చేరుకున్నాయని సీఎం వెల్లడించారు. పరిశ్రమలు రావడం, ఉత్పత్తి ప్రారంభం కావడం, ఉద్యోగాలు కల్పించడం.. ఇవే పెట్టుబడుల విజయానికి అసలైన కొలమానాలని ఆయన స్పష్టం చేశారు.ఇదే క్రమంలో పెట్టుబడిదారులకు ప్రభుత్వ మార్పులతో సంబంధం లేకుండా భరోసా కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కంపెనీలకు ప్రకటించిన ప్రోత్సాహకాలు ఆలస్యం లేకుండా అందించేందుకు ఎస్క్రో వ్యవస్థను కూడా ప్రతిపాదించింది. ఈ చర్యలు అమల్లోకి వస్తే పెట్టుబడిదారుల్లో ప్రభుత్వ విధానాలపై విశ్వాసం మరింత పెరిగే అవకాశం ఉంది.కేవలం పరిశ్రమలు, పెట్టుబడులకే చంద్రబాబు తన లక్ష్యాలను పరిమితం చేయడం లేదు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే




అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలవాలని, తెలుగు ప్రజలు ప్రపంచవ్యాప్తంగా బలమైన గుర్తింపు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికతలను సమర్థంగా వినియోగించుకుంటే భారత్ 10 శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని సాధించే అవకాశముందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏపీ అభివృద్ధికి టెక్నాలజీ, తయారీ రంగం కీలక చోదకశక్తులుగా మారనున్నాయని ఆయన సంకేతాలిచ్చారు.చంద్రబాబు ప్రస్తావించిన మరో కీలక అంశం ఖ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్). ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, ప్రజలు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది ఈ ఆలోచన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. కంపెనీలు కేవలం లాభాలకే పరిమితం కాకుండా తమ వనరులు, పరిజ్ఞానం, నైపుణ్యాలను సామాజిక అభివృద్ధికి కూడా వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు.కియా రూ.17 వేల కోట్ల పెట్టుబడి ప్రతిపాదన ఏపీకి దక్కిన మరో పారిశ్రామిక అవకాశంగా నిలుస్తోంది. అంతకంటే ముఖ్యంగా రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఇది ఊతమిస్తోంది. అయితే ఈ పెట్టుబడి ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చి, పరిశ్రమల నిర్మాణం పూర్తయి, స్థానిక యువతకు ఉద్యోగాలు లభించినప్పుడే ఈ ప్రకటనకు పూర్తి సార్థకత చేకూరుతుంది. 2047 విజన్ దిశగా చంద్రబాబు వేస్తున్న అడుగుల్లో కియా విస్తరణ ఎంత కీలకంగా మారుతుందో రాబోయే రోజులు తేల్చనున్నాయి.'నేవిగేటింగ్ ద న్యూ వరల్డ్ ఆర్డర్' అనే థీమ్‌తో ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ పేరిట జరిగిన ఈ సదస్సుకు వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ముఖ్యంగా రిలయన్స్ సంస్థ రూ. 2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకోగా, కియా సంస్థ ఏడాదికి అదనంగా మరో 2 లక్షల కార్ల తయారీ కోసం రూ. 19000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నాలా యాక్ట్‌ను రద్దు చేశామని చెప్పారు. కేవలం 13 లైసెన్సుల ద్వారా 5 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను తీసుకువచ్చామని, పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల కోసం నిన్నటి నుంచే ఎస్క్రో ఖాతా అమల్లోకి వచ్చిందన్నారు. పారిశ్రామిక సంస్కరణల్లో ఎస్క్రో ఖాతా ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందని, పెట్టుబడుల రక్షణ కోసం త్వరలోనే 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను కూడా తీసుకురానున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. 2024 నుంచి వచ్చిన 714 ప్రతిపాదనల్లో 522 ప్రతిపాదనలు వాస్తవ రూపంలోకి వస్తున్నాయని తెలిపారు.భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, 'వన్ ఫ్యామిలీ - వన్ ఏఐ' విధానం ద్వారా ప్రతి కుటుంబం నుంచి నిపుణులను తయారు చేస్తామన్నారు. తాను గతంలో ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని తెలుగువారిని ప్రపంచ నిపుణులుగా నిలిపినట్లే ఇప్పుడు ఏఐలోనూ ముందుంటామని సీఎం చంద్రబాబు అన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో దేశ లక్ష్యం 500 గిగావాట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రతి ఇంటిపైనా సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయం పూర్తి చేసుకోవడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, సౌత్ కోస్టల్ రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను సాకారం చేసుకున్నామని పేర్కొన్నారు.



ఆధునిక సమాజంలో పెరుగుతున్న సౌకర్యాలు..

తగ్గుతున్న మానవ సంబంధాలు
సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్





అమరావతి, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సౌకర్యాలు పెరుగుతున్నప్పటికీ మానవ సంబంధాలు, మనశ్శాంతి, మానవత్వం తగ్గిపోతున్నాయని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. నేటి సమాజంలోని వాస్తవాలను వివరిస్తూ ఆయన పలు అంశాలను వెల్లడించారు. పెద్ద ఇళ్లు ఉన్నా చిన్న కుటుంబాలు, ఎక్కువ డిగ్రీలు ఉన్నా ఇంగితజ్ఞానం లేకపోవడం, అధిక ఆదాయం ఉన్నా మనశ్శాంతి లేకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. అలాగే ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ఎక్కువ మంది స్నేహితులు ఉన్నా ఆపద సమయంలో తోడుండే నిజమైన స్నేహితులు కరువవుతున్నారని పేర్కొన్నారు. వేగవంతమైన ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చినా మానవ సంబంధాలు నెమ్మదిస్తున్నాయని, స్మార్ట్ పరికరాలు పెరిగినా అర్థవంతమైన సంభాషణలు తగ్గుతున్నాయని వివరించారు. అధిక జీతాలు ఉన్నా సంతృప్తి లేకపోవడం, ఖరీదైన వాచీలు ఉన్నా సమయం లేకపోవడం, ఎక్కువ పరిచయాలు ఉన్నా ఆప్యాయంగా పలకరించే వారు లేకపోవడం నేటి సమాజంలోని పరిస్థితులకు అద్దం పడుతున్నాయని అన్నారు. సాంకేతికత, సంపద, హోదా మాత్రమే జీవితానికి సంతోషాన్ని ఇవ్వలేవని, మానవత్వం, ప్రేమ, అనుబంధాలు, పరస్పర గౌరవం, మనశ్శాంతికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే జీవితం సార్థకమవుతుందని డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు.

గీసుకొండ పీహెచ్‌సీలో వైద్య సేవలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



గీసుకొండ, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

గీసుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సందర్శించి వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫార్మసీ స్టోర్, మందుల నిల్వలు, ఐఎల్ఆర్‌లో భద్రపరిచిన వ్యాక్సిన్లు, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. మందులు, వ్యాక్సిన్ల నిల్వలో నిబంధనలు పాటించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం గీసుకొండ సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్ లక్ష్యాలను సాధించడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శౌర్య శరణ్య, డాక్టర్ అరుణ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో పోలీసుల కారు బీభత్సం..

కాసిపేట, నవంబర్ 14(జై భీమ్ న్యూస్)

మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలో పోలీసు సిబ్బంది ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన ఘటన కలకలం రేపింది. దేవాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు, హోంగార్డు మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి రహదారి పక్కన నిలిపి ఉంచిన ట్రాలీని ఢీకొట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కారు బలంగా ఢీకొనడంతో ట్రాలీతో పాటు వాహనం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. కారు ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాద సమయంలో ట్రాలీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని కారులో ఉన్న పోలీస్ సిబ్బందిని నిలదీశారు. ట్రాలీకి మరమ్మతులు చేయిస్తామని తొలుత హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఆ తర్వాత నష్టపరిహారం చెల్లించబోమని ట్రాలీ యజమాని చింతల సాగర్‌ను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితుడు శుక్రవారం రాత్రి కాసిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డైనట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో కారులో దేవాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు, హోంగార్డు ఉన్నారని బాధితులు పేర్కొంటున్నారు. తొలుత పరిహారం చెల్లిస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు, మరుసటి రోజు మాట మార్చారని ఆరోపిస్తున్నారు. నష్టపరిహారం అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది కావడంతో ప్రమాద సమయంలో కారు నడిపిన అసలు వ్యక్తిని పక్కనపెట్టి, మరొకరిని డ్రైవర్‌గా చూపించే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలను బాధితులు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కాసిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందిపైనే మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమయ్యారనే ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

ఛప్రి' సినిమా టీజర్ ఆవిష్కరణ



'మాంగళ్యం', 'పరాక్రమం', 'నిర్బంధం'తో అందరినీ మెప్పించిన బండి సరోజ్ కుమార్ ప్రస్తుతం 'ఛప్రి' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ మూవీకి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, లిరిక్స్, ఎడిటింగ్, మ్యూజిక్, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతల్ని సరోజ్ నిర్వర్తించారు. ఖాఐ మెయిన్ స్ట్రీమ్ బ్యానర్ మీద సరోజ్, ప్రమోద్ పడమటి, పృథ్వీ చౌహాన్ నిర్మించిన ఈ సినిమాలో సరోజ్‌తో పాటుగా ఐశ్వర్య బోరా, దివ్య జ్యోతి, శ్లోకా, ప్రవీన్, మోహన్ ఆర్య, జీవా బాలచందర్, ప్రియాంక సింగ్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. శనివారం నాడు ఈ మూవీ టీజర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లో.. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ .. "ఛప్రి' సినిమాని సమ్మర్‌లో రిలీజ్ చేయాలని అనుకున్నాం. ఫిబ్రవరిలో టీజర్ ప్లాన్ చేశాం. కానీ ఈ మగాడు సీన్‌ని ఎవరో జూనియర్ ఆర్టిస్ట్ లీక్ చేశాడు. నేను ఎంతో ట్రామాని అనుభవించాను. అందుకే టీజర్‌ను ఇంత ఫాస్ట్‌గా వదిలాం. ఇండస్ట్రీలో, సెట్‌లో మాకు సెక్యూరిటీ లేదు. మీడియా లేకపోతే నేను లేను. నా ఈ జర్నీలో నన్ను సపోర్ట్ చేసిన విలేకరులకు ధన్యవాదాలు. ఈ కథను 700 రోజులు కష్టపడి రాశాను. రివ్యూయర్లను కూడా దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన స్క్రీన్ ప్లేని రాసుకున్నాను. కథకు తగ్గట్టుగా నాకు మంచి ఆర్టిస్టులు దొరికారు. ఆర్ట్ డైరెక్టర్ నాని నాకు ఎంతో సపోర్ట్ చేశారు. ప్రమోద్ అన్న నాకు అండగా నిలబడ్డారు. సమ్మర్‌లో కలుద్దాం. ఈ సినిమాతో మనమేంటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. నటుడు ప్రవీణ్ మాట్లాడుతూ .. "మోగ్లీ' చిత్రంలో సరోజ్ గారిని చూసి నంబర్ తెలుసుకుని ఫోన్ చేసి మాట్లాడాను. సరోజ్ గారితో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ చాలా కొత్తగా ఉంది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని ఆశిస్తున్నాను. వచ్చే ఏడాది సమ్మర్‌లో 'ఛప్రి' రిలీజ్ కాబోతోంది. హీరోగా సరోజ్‌కి థియేట్రికల్‌గా మంచి సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. అజయ్ సాయి మాట్లాడుతూ .. "ఛప్రి' టీజర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన సరోజ్ గారికి థాంక్స్. ముమ్ముందు మరిన్ని అప్డేట్‌లతో మీ ముందుకు వస్తామ'ని అన్నారు. దివ్య జ్యోతి మాట్లాడుతూ .. "ఛప్రి' సినిమాలో అద్భుతమైన పాత్రను ఇచ్చిన సరోజ్ గారికి థాంక్స్. ఈ జర్నీలో 'ఛప్రి' టీం ఎంతో సపోర్ట్ చేసింది' అని అన్నారు. రమేష్ మాట్లాడుతూ .. 'సరోజ్ గారితో నేను మూడో సారి నటిస్తున్నాను. నన్ను ఎప్పుడూ సపోర్ట్ చేస్తూ వస్తున్న సరోజ్ గారికి థాంక్స్' అని అన్నారు. జీవా మాట్లాడుతూ .. "సరోజ్ గారిని చూసి ఎంతో ఇంప్రెస్ అవుతుంటాను. 'ఛప్రి' ఆడిషన్స్ కోసం సరోజ్ గారికి మెసెజ్ పెట్టాను. నన్ను నమ్మి మంచి పాత్రను ఇచ్చిన సరోజ్ గారికి థాంక్స్. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. ప్రమోద్ పడమటి మాట్లాడుతూ .. 'సరోజ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల నుంచి అనుబంధం ఉంది. ముందుగా మేం 'నిర్బంధం'ని నెట్ ఫ్లిక్స్ కోసం అనుకున్నాం. కానీ చివరకు యూట్యూబ్‌లోకి తీసుకు వచ్చాం. మాకు అక్కడ అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు సరోజ్ 'ఛప్రి'తో ఆడియెన్స్ ముందు రాబోతోన్నారు. థియేటర్లో 'ఛప్రి' దద్దరిల్లిపోతుంది' అని అన్నారు. ఐశ్వర్య మాట్లాడుతూ .. 'సరోజ్ గారితో వర్క్ చేయడం కొత్త అనుభూతిని ఇచ్చింది. అస్సాం నుంచి ఇక్కడకు వచ్చి ఇలా 'ఛప్రి'లో నటించడం ఆనందంగా ఉంది. మా సినిమా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు. తారాగణం: సరోజ్, ఐశ్వర్య బోరా, దివ్య జ్యోతి, శ్లోకా, ప్రవీణ్, మోహన్ ఆర్య, జీవా బాలచందర్, ప్రియాంక సింగ్ తదితరులు.

వింటారా సరదాగా' సినిమా జనవరి 1న రిలీజ్



అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా ఉద్భవ్ రఘు దర్శకత్వంలో రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. నూతన సంవత్సరానికి వినోదభరితమైన ఆహ్వానం పలుకుతూ యంగ్ హీరో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎమాం ? వింటారా సరదాగా' ప్రపంచవ్యాప్తంగా జనవరి 1, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ప్రేమ, స్నేహం, సరదా, యువత జీవితంలోని అనుభవాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం న్యూ ఇయర్ సందర్భంగా ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది. ఉద్భవ్ రఘు దర్శకత్వం వహించిన ఈ చిత్రం అమెరికా నేపథ్యంలో సాగుతుంది. ఉన్నతమైన కలలను సాకారం చేసుకోవాలనే ఆశయంతో స్వదేశాన్ని విడిచి అమెరికాకు వెళ్లిన తెలుగు విద్యార్థుల జీవితాల చుట్టూ కథనం సాగుతుంది. విదేశాల్లో విద్యార్థుల జీవనశైలి, స్నేహాలు, ప్రేమలు, అనుకోని సంఘటనలు, ఎదురయ్యే ఆసక్తికరమైన పరిస్థితులను వినోదాత్మకంగా ఈ సినిమాలో ఆవిష్కరించారు. ఇప్పటికే విడుదలైన రెండు టీజర్లు సినిమాపై మంచి ఆసక్తిని పెంచాయి. యూత్‌ఫుల్ కథాంశం, వినోదభరితమైన సన్నివేశాలు, అశోక్ గల్లా ? శ్రీ గౌరీ ప్రియ జంట మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ కూడా ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఇప్పటివరకు విడుదలైన 'అనగా అనగా అమెరికా', 'చింగారి' పాటలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంజిత్ హెగ్డే ఆలపించిన 'అనగా అనగా అమెరికా' పాట అమెరికాలో హీరోహీరోయిన్ల ప్రయాణంలోని ప్రేమ, కొత్తదనం, ఆహ్లాదకరమైన భావాలను ఆవిష్కరిస్తే, సిద్ శ్రీరామ్, లిప్సిక ఆలపించిన 'చింగారి' పాట ప్రేమలోని మధురమైన అనుభూతులను పలికించింది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ ఈ చిత్రానికి చక్కటి సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటించగా, రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వివా హర్ష, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఎస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ లవ్, ఫ్రెండ్‌షిప్, ఫన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రూపొందిన 'ఎమాం ? వింటారా సరదాగా' 2027 నూతన సంవత్సరాన్ని థియేటర్లలో మరింత సందడిగా ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.



వరుసగా రెండు హిట్లు కొట్టిన చార్మింగ్ స్టార్ శర్వా, శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్'తో హ్యాట్రిక్ హిట్ పూర్తి చేయడానికి సిద్ధమవుతున్నాడు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏటీవీ సమర్పిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శర్వా సరసన మానస వారణాసి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన జార్జ్ క్రిష్ ఫస్ట్ బూస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది ఇందులో శర్వానంద్‌ను రెండు విభిన్న మతాలకు చెందిన పాత్రల్లో పరిచయం చేశారు. క్రిస్టియన్‌గా జార్జ్, హిందువుగా క్రిష్ పాత్రల్లో శర్వా అలరించారు. పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో ఈ రెండు పాత్రలను చూపిస్తూ క్యూరియాసిటీ పెంచారు. తాజాగా సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీనువైట్ల, హీరోయిన్ మానస వారణాసి పాల్గొన్నారు. డబ్బింగ్ ప్రారంభమైన సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి తన పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెబుతున్న వీడియో ఆకట్టుకుంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు, కేవీ గుహన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్. అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రచయితలుగా వ్యవహరిస్తుండగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. 'జార్జ్ క్రిష్' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు హ్యూమర్, రొమాన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కూడిన కలర్‌ఫుల్ ఫీస్ట్ అందించేందుకు 'జార్జ్ క్రిష్' సిద్ధమౌతోంది. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, మానస వారణాసి

గోట్' మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ అద్భుతంగా ఉందని మెచ్చుకుంటున్నారు - నిర్మాత మొగుళ్ల చంద్రశేఖర్

జైష్ణవ్ ప్రొడక్షన్స్, మహతేజ క్రియేషన్స్ బ్యానర్ల మీద మొగుళ్ల చంద్రశేఖర్ నిర్మాతగా, రవిందర్ రెడ్డి సహ నిర్మాణంలో సుడిగాలి సుధీర్ హీరోగా వేదవ్యాస్ తెరకెక్కించిన చిత్రం 'గోట్'. ఈ సినిమాలో నితిన్ ప్రసన్న, దివ్య భారతి కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమా నవంబర్ 12న విడుదలై బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ క్రమంలో శనివారం నాడు సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. నిర్మాత చంద్రశేఖర్ మాట్లాడుతూ .. "మాది మూడేళ్ల ప్రయాణం. ఈ జర్నీలో మాకు ఎదురైన సవాళ్ల గురించి అందరికీ తెలుసు. వేద వ్యాస్ గారు ఎంట్రీ ఇచ్చాకే ఈ కథకు ప్రాణం వచ్చింది. మంచి మెసెజ్ ఇచ్చేలా సినిమాని రూపొందించాం. మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ అద్భుతంగా ఉందని మెచ్చుకుంటున్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా పట్టు వీడకుండా చివరి వరకు నిలబడి సినిమాను ఇక్కడి వరకు తీసుకు వచ్చాను. నేను ఈ సినిమా జర్నీలో పడిన కష్టాల్ని ఓ చిత్రంగా తీస్తాను. నాకు ఈ జర్నీలో దివ్య భారతి గారు ఎంతో సహకరించారు. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థాంక్స్' అని అన్నారు. దివ్య భారతి మాట్లాడుతూ .. "గోట్' మూవీని ఆడియెన్స్ థియేటర్లో చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. నా మీద అంతులేని ప్రేమను కురిపిస్తున్నారు. మేం ఈ చిత్రం కోసం పడిన కష్టం వృథా కాలేదని ఆడియెన్స్ రియాక్షన్స్ చూస్తే అర్థమైంది. ప్రేక్షకుల స్పందన చూసి మాకు సంతృప్తి కలిగింది. 'గోట్' చిత్రానికి వస్తున్న స్పందన చూస్తుంటే నాకెంతో సంతోషంగా ఉంది. పట్టు వదలకుండా నిలబడిన మా నిర్మాత చంద్రశేఖర్ గారికి ధన్యవాదాలు. మాకు అండగా నిలబడిన వేద వ్యాస్ గారికి థాంక్స్' అని అన్నారు. దర్శకుడు వేద వ్యాస్ మాట్లాడుతూ .. "గోట్' సినిమాకి థియేటర్లో అద్భుతమైన స్పందన వస్తోంది. అక్కడ ఆడియెన్స్ రియాక్షన్స్ చూసి నేను ఎంతో ఎంజాయ్ చేశాను. మాకు సపోర్ట్ చేస్తున్న మీడియా, ఆడియెన్స్‌కి థాంక్స్. ఈ మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ సక్సెస్ ప్రతీ ఒక్కరికీ చెందుతుంది. బెట్టింగ్ అనేది ఫన్. కానీ లైన్ క్రాస్ చేయకూడదు. ఆ పాయింట్‌ని నేను కాస్త వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాను. ఈ సినిమాని చూసి బెట్టింగ్ ఒక్కడు ఆపినా చాలు' అని అన్నారు. నితిన్ ప్రసన్న మాట్లాడుతూ .. "గోట్' సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తోంది. థియేటర్లు అన్నీ ఫుల్ అవుతున్నాయి. ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. వేద వ్యాస్ గారు కథను మాకు అద్భుతంగా నెరేట్ చేశారు. వేద వ్యాస్ గారు ఈ చిత్రంతో మంచి సందేశాన్ని ఇచ్చారు' అని అన్నారు. మాస్టర్ మురారి మాట్లాడుతూ ..'నా పాత్రకు ఇలాంటి అద్భుతమైన స్పందన వస్తుందని మా దర్శక, నిర్మాతలు ముందే చెప్పారు. వారు చెప్పినట్టుగానే జరిగింది. ఇంకా ముమ్ముందు ఇలానే అందరినీ ఎంటర్టైన్ చేసేందుకు ప్రయత్నిస్తుంటాను' అని అన్నారు.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM